# దీపస్సర్వ తమోపహా:

**లంగిరాల జానకిరామ్**

''దీపం జ్యోతి పర(బహ్మ
దీపస్సర్వ తమోపహా:
దీపేన సాధ్యతే సర్వం
సంధ్యాదీప నమోస్తుతే''

అన్న శ్లోకం చదువుతూ, అసుర సంధ్యవేళ, పెరట్లో తులసికోట దగ్గర (ప్రమిదలో దీపాన్ని వెలిగించి భక్తి (ప్రపత్తులతో నమస్కరించింది, సుభ(ద్రమ్మ.

ఆవిడమొహం ఆనందంతో వెలిగిపోతోంది. ఆ (క్రితంరోజు వరకు బావురుమంటూ నిశ్శబ్దంగా ఉన్న ఆ ఇంటికి, కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు వస్తూనే దీపావళి శోభను వెంటబెట్టుకొచ్చారు. నిత్యం అమావాస్యలాంటి తన జీవితానికి నిజమైన వెలుగునిచ్చేది కూడా, ఆ అమావాస్య! అదీ, ఆ ఒక్కరోజునే! ఆరోజు ఉదయం నుంచి, పిల్లలంతా గారాలుపోయి, మారాంచేసి కొని పించుకున్న టపాసులను, పేచీలుపడి, పోటీలుపడి, సాయం(త్రందాకా ఎవరి భాగాలను వాళ్ళు పంచు కున్నారు. వాళ్ళంతా లోకాన్ని మరచి టపాసులను కాలుస్తూ, ఆనందిస్తుంటే, ఈ లోకంతో సంబంధం లేకుండా, నోరుతెరచి, భావ, చలనరహితమైన దృక్కు లను శూన్యంలోకి (ప్రసరిస్తూ, ఒకవిధమైన సమాధిలో మార్చున్న తన ఆఖరి, పేరుకుకూడా నోచుకోని అభాగ్యుడైన కొడుకుని చూసి సుభ(ద్రమ్మ కడుపులో దేవినట్లయింది.

వాడు, ఈ లోకంతో సంబంధంలేకుండా, పది సంవత్సరాల(క్రితం ఈ లోకంలోపడింది, ఈ రోజునే! బాధతో మనసు మెళ్ళుతిరిగి, కళ్ళు తుడుచుకుంది. ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు జీవితంలో స్థిర పడ్డాక, సుభ(ద్రమ్మ నడివయసులో తన కడుపులోబడ్డ ఈ అభాగ్యుణ్ణిమోస్తూ, లోకం దృక్కులను ఎదుర్కొనలేక సిగ్గుతో కుంచించుకుపోతూ వంచినతల ఇప్పటివరకూ ఎత్తలేదు. వాడీభూమ్మీద పడినప్పుడు, వాడికి శారీరక ఎదుగుదలతోపాటు మానసిక ఎదుగుదలలేదనీ, ఉండ దనీ, వాడొక జడపదార్థమనీ, చెప్పలేడనీ, వినలేడనీ లాంటి పిడుగువార్తలను విని సుభ(ద్రమ్మ నవనాడులూ కుంగి, (ప్రాణాలు అనంతవాయువుల్లోకి వెళ్ళకుండా కాపాడింది. సుభ(ద్రమ్మ భర్త ధర్మారావు. ఆయన మనోనిబ్బరం, గుండెధైర్యం, వాడిని సాకటానికి ఆవిడకు చేయూతనిచ్చింది. కాల(క్రమేణా, ఆయన నిబ్బరం సడలి, ని(గ్రహంకోల్పోయి, తనేం పాపంచేశాడని దేవుడు తనకే శిక్ష విధించాడని, సృష్టికర్తను నిలదీసి (ప్రశ్నించ డానికి వెళ్ళి రెండేళ్ళయింది. ఇంకా సుభ(ద్రమ్మ కడుపుతీపి, మమకారం, దయ, జాలి గుణాలన్నీ ఏకమై, ఆవిడను భర్తమార్గాన్ని అనుసరించనీయకుండా అడ్డు పడ్డాయి.

టపాసుల సందడి సద్దుమణగడంతో, సుభ(ద్రమ్మ ఈ లోకంలోకివచ్చింది. పిల్లలూ, పిల్లల పిల్లలూ, అందరూ పండుగబడలికను తీర్చుకుంటూ సుభ(ద్రమ్మ చుట్టూ చేరారు. అందరినీ, తృప్తిగా, కనులపండుగ చూసుకుంటోంది సుభ(ద్రమ్మ.

''అమ్మా! నిన్ను మాతోపాటు అమెరికాతీసికెళ్ళ తాను ఏదిక్కూలేనట్టు నువ్వెంతకాలం ఇక్కడ ఉంటావు?'' గత సంవత్సరకాలంగా, పెద్ద ఉద్యోగం మీద అమెరికాలో ఉంటున్న పెద్దకొడుకు 'అభిమన్యు' అడిగాడు.

''వద్దన్నయ్యా! ఈ వయసులో అమ్మ అమెరికా రాదు, రాలేదుకూడా. అమ్మా! నాతో హైదరాబాదు వచ్చేసెయి. నీకేలోటూ ఉండదు'' బ్యాంక్ ఆఫ్ హైదరాబాదులో ఆఫీసరుగా స్థిరపడ్డ రెండోకొడుకు రవికిరణ్ అంటున్నాడు.

''అవునత్తయ్యా! మీకు మాదగ్గరైతే సుఖంగా ఉంటుంది. పైగా మీ ఆచారానికి ఏలోటూ ఉండదు'' రవికిరణ్ భార్య సరోజ, భర్తకు వత్తాసుపలుకుతోంది.

''ఎక్కడికీ వద్దమ్మా! నువ్వసలు నాదగ్గరే ఉండాలి. హాయిగా విశాఖపట్నం వచ్చేయి. ఏమండీ! అమ్మను మనతో తీసికెళదామండీ!'' ఈ మధ్యే పెళ్ళయిన సుభ(ద్రమ్మ రెండోకూతురు రమ, భర్తను గారాలు పోతూ అడుగుతోంది.

''ఎన్నిసార్లడిగినా అమ్మ విజయవాడ వదిలిరాదు గానీ, వస్తే నాదగ్గర ఉండుకోవడానికి నాకేమీ అభ్యంత రంలేదు'' అసలావిడకా ఉద్దేశ్యమేలేదని (గ్రహించి మరింత నొక్కిచెబుతున్న పెద్దకూతురు, ఉమ.

అందరికీ సమాధానంగా, సుభ(ద్రమ్మ అందరివంకా నిశితంగా ఒకచూపుచూసింది. ఆ చూపుకు అర్థంతెలి సిన అందరూ మౌనంవహించారు.

ధర్మారావు తనువుచాలించిన పదోరోజునే ఈ సమస్య చర్చకువచ్చింది. అందరూ ఈరోజున అడిగి నట్లుగానే, ఆరోజునకూడా సుభ(ద్రమ్మను మ(మాత్రం తమతోరమ్మన్నారు. ఆరోజు జరిగిన వాగ్వివాదం ఇంకా సుభ(ద్రమ్మ చెవుల్లో (ప్రతిధ్వనిస్తూనే ఉంది.

తనకు నడివయసులో కడుపున పుట్టినా, తమ తోడ



బుట్టినవాడన్న దయ, జాలి లేకుండా అందరి నిరాదరణకు గురౌతూ, భగవంతుడి కర్కశసృష్టికి బలైపోయిన, నోరులేని ఆ అభాగ్యుడి సంగతేమిటని అడిగింది. తనతోబాటు, వాడిబాధ్యత కూడా పంచుకోమనీ అడిగింది. సుభద్రమ్మ కొడుకులు, కూతుళ్ళు ఆవిడకెంతో నచ్చజెప్పచూయి, ఆవిడ హృదయాన్ని మాటల్తో తూట్లు పొడిచారు. వాడికర్మ వాడనుభవించవలసిందేనన్నారు. కేవలం శరీరాకృతి తప్ప, మెదుడులేని, భవిష్యత్తులో వచ్చే అవకాశం కూడాలేనివాడిని గురించి ఆలోచించడం అర్థరహితమన్నారు. ఒకప్రక్క వయసుతెచ్చిన వార్ధక్యాన్ని అనుభవిస్తూ, కుడిచెయ్యనక, ఎడమచెయ్యనక వాడిని సాకటం ఆవిడకు శక్తికిమించిన పనన్నారు. ఇంక ఏంటూ ఊరుకోలేక, "అయితే, వాడినేంచేస్తారు? ఏంచేద్దామనుకుంటున్నారు?" అని అందరినీ ఉద్దేశించి, ఆశ్చర్యంతో అడిగింది సుభద్రమ్మ.

కొన్నిక్షణాల నిశ్శబ్దంతరువాత, "చేసేదేముందీ! వాడినేదన్నా అనాథశరణాలయంలో చేర్పించడం, నిన్ను మాతో తీసికెళ్ళడం" గబగబా ప్రతిపాదించి తలవంచుకున్నాడు, పెద్దకొడుకు, అభి.

అభిమన్యు అన్నది విని అర్థంచేసుకోవడానికి, తనకున్న శక్తిచాలదేమో అనిపించి, అందరివంకా దీనాతిదీనంగా చూసింది సుభద్రమ్మ. అందరూ దారుణమైన అతని ప్రతిపాదన బలపరుస్తున్నట్లు మౌనంగా తన వంక చూడటంతో, నిలబడే శక్తిలేక, మొదలునరికిన చెట్లల్లే, గుండెలవిసేలా రోదిస్తూ కుప్పలాకూలి పోయింది. కొంతసేపు భయంకరమైన నిశ్శబ్దం అలము కుందా గదిలో. ఆ నిశ్శబ్దాన్ని భరించలేనట్లు, ఆవిధి కుక్క ఏడుస్తోంది. సృష్టికి తిరిగి చైతన్యం వచ్చింది.

పిల్లలతల్లులై, తండ్రులై ఉండికూడా, వాళ్ళకు రక్తస్పర్శ, కడుపుతీపి తెలియకుండా ఉండంటే నమ్మలేకపోతోంది. నవమాసాలు మోసి, కని, పెంచి, విద్యాబుద్ధులు చెప్పించి ప్రయోజకుల్నికావిస్తే, మానవత్వపు విలువలు నశించి, సంస్కారహీనంగా ప్రవర్తిస్తున్నందుకు ఆవిడ ఆక్రోశించింది. సుభద్రమ్మ తన నిర్ణయాన్ని నిర్మొహమాటంగా ప్రకటించింది.

తనరక్తపు ఆఖరిబొట్టువరకు, తుది శ్వాశవిడిచే వరకూ, ఆ అభాగ్యుడినే అంటిపెట్టుకు ఉంటాననీ, ఇహలోకపువాసనలు అంటనివాడు, దైవంతో సమానమనీ, వాడిసేవే పరమార్థంగా భావిస్తాననీనూ.

అభిమన్యు పెద్దకూతురు-పద్మ, దీపావళికి పిడొక్కలు చెబుతూ, పంచదారతో అందరినోళ్ళను తీపిచేస్తూ, తన నోటిదగ్గర చెయ్యిపెడుతుంటే, మళ్ళీ ఈ లోకం లోకి వచ్చింది, సుభద్రమ్మ. గత అనుభవాలతాలూకు చేదు స్మృతులు ఇంకా వెన్నాడుతుంటే, నోట్లో పంచదారకూడా, చేదుగా అనిపించింది.

పండగ హడావిడి అయిపోయింది. మళ్ళా ఇల్లంతా బావురుమంటోంది. సుభద్రమ్మ దేవుడిసేవకు పునరంకితమైంది. కాలం దానిపనది చేసుకుపోతోంది. మళ్ళీ



ఇంకొక వారంరోజుల్లో దీపావళి రాబోతోందనగా, సుభద్రమ్మ తీవ్ర అనారోగ్యంతో మంచాన పడిందన్న వార్తను, పొరుగువాళ్ళు ఇచ్చిన టెలిగ్రాం మోసుకుపోతే, ఏదో పనిమీద స్వదేశంవచ్చిన అభిమన్యుతోసహా అందరూ వచ్చారు. తలుపులు బార్లాతెరచిఉన్నాయి. అదిరేగుండెలతో లోపలకు అడుగుపెట్టిన వాళ్ళకు, అక్కడ కనిపించిన దృశ్యంతో నోటమాటరాక, నిశ్చేష్టులై నిలబడిపోయారు.

మరి ఏపేగుసంబంధమో, సృష్టి విచిత్రమో తెలియదుకాని, శాపగ్రస్తుడైన ఆ అభాగ్యుడు, వళ్ళు తెలిసీ, తెలియని స్థితిలో సుభద్రమ్మ ఆకారమాత్రంగా మంచంమీద పడిఉంటే, ఆవిడతలదగ్గరచేరి, పొరుగు వాళ్ళు జాలితో తనకుపెట్టిన అన్నాన్ని, తనరెండు చేతులతో, ఆవిడనోటిదగ్గరకు చేర్చడానికి అవస్థ పడుతున్నాడు.



రక్తస్పర్శ, ప్రేమ, జాలి, అలలు అలలుగా వచ్చి తాకుతుంటే, మానవత్వమనే కెరటం ఉవ్వెత్తున లేచి, వాళ్ళను ముంచెత్తివేసింది.

సుభద్రమ్మ ఆస్పత్రినుంచి దీపావళిరోజుసాయంత్రం డిశ్చార్జ్ అయింది. అభిమన్యు ఆవిడను నెమ్మదిగా కార్లోంచి దింపి, చేయూతనిచ్చి లోపలకు తీసుకొస్తున్నాడు. పిల్లలంతా ఆనందంగా టపాసులు కాలుస్తున్నారు.

"అమ్మా! తమ్ముడికి అన్నంతినిపించారా?" అభిమన్యు భార్యని పిలిచి అడుగుతున్నాడు.

"సరోజ తినిపిస్తోందడీ?" అంటూ అనూరాధ అత్తగారికి మంచంవాల్చి, పక్కవేస్తూ జవాబుచెబుతోంది.

"రవీ! అమ్మ జాగ్రత్త. ఎలాచూస్తావో, ఏమో! నేను అమెరికావెళ్ళి తమ్ముడి వైద్యానికి అన్నిఏర్పాట్లు చేస్తాను. నేను ఉత్తరంరాసిన వెంటనే, అమ్మనీ, తమ్ముడినీ దగ్గరుండి విమానంఎక్కించు..." అంటూ అభిమన్యు, రవికిరణ్‌కు అప్పగింతలు పెడుతున్నాడు.

టపాసులసందడి సద్దుమణిగింది. పిల్లలంతా చేతుల్లో పంచదారతో సుభద్రమ్మచుట్టూ చేరి, తలా ఒక చిటికెడూ, ఆవిడనోట్లో వేశారు.

సుభద్రమ్మకు, ఎన్నో దీపావళులతర్వాత, నోట్లో పంచదార తియ్యగాఉంది. మంచంమీదనుంచి ఒక్కసారి లేచివెళ్ళి, ఎటో శూన్యంలోకి చూస్తూకూర్చున్న దేవుడిని ఆర్తితో దగ్గరకుతీసుకుని, గుండెలకు హత్తుకుంది సుభద్రమ్మ.


